కరెంట్‌పై కర్ణాటక పోదామా?

- కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ సవాల్
- అక్కడ 5 గంటలు కూడా ఇస్తలేరు
- రాజకీయ స్వార్థంతోనే కాళేశ్వరంపై రాద్ధాంతం
- మేడిగడ్డ బరాజ్ 28 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుంది
- దేశంలో మూడోవంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే
- మీట్ ద ప్రెస్‌లో మంత్రి కేటీఆర్

బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) శనివారం నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): కర్ణాటక మాడల్ అని కాంగ్రెస్ ఊదర గొడుతున్నది కానీ.. ఆ మాడల్‌తోనే తాము మునిగిపోయామని ఆ రాష్ట్ర రైతులు తెలంగాణకు వచ్చి చెప్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేతారక రామారావు విమర్శించారు. కర్ణాటక రైతులను డబ్బులిచ్చి తీసుకొస్తున్నారన్న కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.'ఒక పని చేద్దాం.. కర్ణాటకకే వెళదాం.. అక్కడి ఊళ్లలో తిరుగుదాం.. రైతులను అడుగుదాం.. ఒకటే బస్సులో అందరం కలిసి వెళదాం.. మళ్లీ తిరిగి వద్దాం. అక్కడి రైతులు చెప్పిన దాని ఆధారంగా ఇక్కడికి వచ్చి ఓట్లు అడుగుదాం. కర్ణాటక కరెంట్ కావాలో.. తెలంగాణ కరెంటు కావాలో ప్రజలే నిర్ణయిస్తారు' అని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలిచ్చారు. ప్రగతి నివేదికతో ప్రజల ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణను అప్పుల పాలు చేశారని కొందరు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పు తెచ్చిన ప్రతి పైసాను తెలంగాణ ప్రగతి కోసమే ఖర్చు చేశామన్నారు. విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 7 వేల మెగావాట్ల నుంచి 26 వేల మెగావాట్లకు పెంచామ తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఐదు గంటల కరెంట్ ఇవ్వలేకపోతున్నదని విమర్శించారు. కర్ణాటక రైతులు తెలంగాణకు వచ్చి తమలాంటి తప్పు చేయొద్దని విన్నవిస్తున్నారని గుర్తుచేశారు.

ఎట్లుండె తెలంగాణ? ఇప్పుడు ఎట్లయింది!

ఒకప్పుడు తెలంగాణ ఎట్లుండేదో.. ఇప్పుడెట్లున్నదో తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన చూస్తే అర్థమవుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ వచ్చినంక ఏం సాధించామని అడిగేవాళ్లకు.. దేశానికి దిక్సూచిగా మారామని, తెలంగాణ ఆచరిస్తే.. దేశం అనుసరించే స్థాయికి ఎదిగామని తెలంగాణ బిడ్డగా గర్వంగా చెప్పాలని సూచించారు. 'సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య మాడల్ తెలంగాణది. తలసరి ఆదాయంలో మనమే నంబర్ వన్. జీఎస్డీపీలో దేశానికే ఆదర్శంగా ఎదిగాం. దేశంలో క్లిష్ట పరిస్థితులున్నా తెలంగాణలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. తెలంగాణలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్ ఎవరైనా సరే అందరినీ సమభావంతో చూస్తున్నాం. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పినట్టు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం రాష్ట్రంలో విరాజిల్లుతున్నాయి. ఇక్కడ ఏం తినాలన్నా తినొచ్చు. ఏ బట్టలు కావాలన్నా వేసుకోవచ్చు. అనేక రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి లేదు. బీఫ్ తింటే, జై శ్రీరామ్ అనకుంటే, రైలులో వెళ్లేటప్పుడు గడ్డం, టోపీ ఉంటే దాడులు చేస్తున్నారు. ఇది దేనికి సంకేతం? అని ప్రశ్నించారు.

బీసీ ప్రెసిడెంట్‌ను తీసేసిన మీరు బీసీని సీఎం చేస్తారా?

రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిన బీసీ నేతను తొలగించిన బీజేపీ, ఇప్పుడు బీసీని సీఎం చేస్తానంటే తెలంగాణ ప్రజలెవరూ నమ్మబోరని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఓబీసీ వర్గం నుంచి వచ్చిన ప్రధాని మోదీ.. ఆయన పాలనలో ఓబీసీలకు కనీసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదు. నాయకుడికి కావాల్సిందికులం కాదు.. గుణం. మోదీ ఇస్తానన్న ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి? పేదల ఖాతాలో వేస్తానన్న రూ.15 లక్షలు ఎక్కడపోయాయి? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్నారు. దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేస్తానన్నారు. పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామన్నారు. అవన్నీ ఏమయ్యాయి?' అని ప్రశ్నించారు. ఓడిపోయే నియోజకవర్గాలను బీసీలకు కేటాయించిన బీజేపీ, వారి ఓటమిని కూడా బీసీ వర్గం మొత్తానికి ఆపాదిస్తుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 110 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు.

భారీ వరదను తట్టుకున్న మేడిగడ్డ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలుంటే ఇప్పటికే బయటపడేవని, ఐదేండ్లలో లక్షల క్యూసెక్కుల వరదను ఆ బరాజ్‌లు తట్టుకొన్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. మేడిగడ్డ బరాజ్ 28 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని నిలబడిందని గుర్తు చేశారు. పిల్లర్ కుంగుబాటుపై కేంద్ర డ్యామ్ సేఫ్టీ బృందం పర్యటిం చి విచారిస్తున్నదని, ఆ కమిటీ నివేదిక తర్వాత తగు చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ అంశంపై ప్రతిపక్షాల ఆరోపణలకు స్పందించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ప్రతీకార రాజకీయాలు చేసే అలవాటు బీఆర్ఎస్‌కు లేదని, అలాంటి రాజకీయాలు చేస్తే రేవంత్ ఎప్పుడో జైలుకెళ్లేవాడని తెలిపారు. 50 ఏండ్ల పాలనలో మైనార్టీలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నాని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో మైనార్టీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు 10 ఉంటే, తాము 204కు పెంచామని చెప్పారు. మైనార్టీ సంక్షేమానికి ఏటా సగటున రూ. 1,000 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు.

> కాంగ్రెస్ పాలనతో తమకు పొంతన లేదని, ఆ పార్టీతో పోలిక అవసరమే లేదని స్పష్టంచేశారు. కాలుష్యరహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు వేస్తున్నామని, 2047 నాటికి రాష్ట్రంలో జీరో ఎమిషన్ లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొస్తామని చెప్పారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల, మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తున్నామని వివరించారు.

ధరలు పెంచిందే బీజేపీ

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలియం ఉత్పత్తులపై సుంకం పెంచలేదని మంత్రి కేటీఆర్ అన్నారు. 2014 లో క్రూడాయిల్ ధరకు రూపాయి మాత్రమే పెరిగిందని, కానీ కేంద్రం అదనపు ఎక్సైజ్ డ్యూటీ, అదనపు సెస్‌ను విధించడంవల్లే పెట్రోలియం ధరలు తగ్గడం లేదని తెలిపారు. చమురు ఉత్పత్తులపై మోదీ ప్రభుత్వం ప్రజల నుంచి రూ.30 లక్షల కోట్లు కాజేసిందనే విషయంపై ఎలాంటి చర్చకైనా తాము సిద్ధమని ప్రకటించారు. పేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా 400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించామని చెప్పారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులే..

హైదరాబాద్ రాష్ట్రాన్ని పరాధీనంలోకి నెట్టింది కాంగ్రెస్ అని కేటీఆర్ విమర్శించారు. 1956లో మనకు ఇష్టంలేకుండా ఆంధ్రతో కలిపి చారిత్రక తప్పు చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ చేసిన తప్పు నుంచి బయటపడటానికి 58 ఏండ్లు పట్టిందని తెలిపారు. వందల మందిని చంపిన తర్వాత 2014లో రాష్ట్రాన్ని ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టడంతో అక్కడ ఎలాగూ కుప్పకూలిందని, కనీసం తెలంగాణలోనైనా నాలుగు సీట్లు వస్తాయనే ఆశతోనే కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చింది తప్ప తెలంగాణపై ప్రేమతో కాదని అన్నారు.

> తండాను పంచాయతీ చేసింది కేసీఆర్
> 6% రిజర్వేషన్‌ను 10% చేసింది కేసీఆర్
> గిరిజనులకు పోడు పట్టాలిచ్చింది కేసీఆర్
> దళితబంధు పథకం తెచ్చింది కేసీఆర్
> రైతుబంధు ఆలోచన చేసింది కేసీఆర్
> ప్రతి రైతుకు జీవిత బీమా చేయించింది కేసీఆర్
> యాదాద్రిని అద్భుతంగా మార్చింది కేసీఆర్
> హైదరాబాద్‌ను ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా చేసింది కేసీఆర్
> వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రభాగాన నిలిపింది కేసీఆర్
> ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్‌గా చేసింది కేసీఆర్
> డాక్టర్ల ఉత్పత్తిలో నంబర్ వన్‌గా నిలిపింది కేసీఆర్
> ఇంటింటికీ సన్నబియ్యం ఇస్తామని చెప్తున్నది కేసీఆర్
> మహిళకు రూ.3 వేల భృతి ఇస్తామంటున్నది కేసీఆర్
> పింఛన్లను రూ.5 వేలకు పెంచుతామన్నది కేసీఆర్
> రూ.400లకే గ్యాస్ బండను ఇస్తామంటున్నది కేసీఆర్..
> వీటన్నింటినీ ప్రజలు నమ్ముతున్నరు.
> ఎందుకంటే కేసీఆర్ ట్రాక్‌రికార్డ్ అట్లాంటిది. చెబితే చేస్తారనే క్రెడిబులిటీ అట్లాంటిది అని మంత్రి కేటీఆర్ తెలిపారు.

నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా సాధించిన సీఎం కేసీఆర్
ప్రతినీటి చుక్కనూ ఒడిసి పట్టి మన భూములకు మళ్లించింది కేసీఆర్
ప్రతి ఇంటికి నల్లా పెట్టి నీళ్లిచ్చి మన దాహార్తిని తీర్చిన ముఖ్యమంత్రి
ఏడాదికి 13 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన ముఖ్యమంత్రి
మరో 90 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తున్న ముఖ్యమంత్రి

ఇవన్నీ ప్రజల ముందుంచి ఎన్నికలకు వెళ్తున్నాం. ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాలకు జాబ్ క్యాలెండర్

దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనంతగా ఉద్యోగ నోటిఫికేషన్లు భర్తీ చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. నియామకాల కోసం రానున్న రోజుల్లో ప్రత్యేక జాబ్ క్యాలెండర్‌తోపాటు, రిటైర్మెంట్ ఏడాదిలోనే కొత్త నియామకాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. తమ హయాంలో 2.22 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తించాలని, ప్రతిపక్షాల దిగజారుడు మాటలకు స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. దేశవ్యాప్తంగా ఏడాదిలో 4.5 లక్షల మందికి ఉద్యోగ కల్పన జరిగితే.. ఒక్క హైదరాబాద్ నుంచే 1.5 లక్షల ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టిందని, ఇప్పటికే 1.30 లక్షలు భర్తీ చేసిందని, మరో 90 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు.

శనివారం తెలంగాణభవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నేతృత్వంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన చున్నూపాషా

కూకట్‌పల్లిలో కాంగ్రెస్‌కు ఝలక్

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన చున్నూపాషా

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 28: కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇతర పార్టీ నుంచి వచ్చిన బండి రమేశ్‌ను ప్రకటించడంతో నియోజకవర్గంలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఇప్పటికే కూకట్‌పల్లి పార్టీ సీనియర్ నేత గొట్టిముక్కల వెంగళరావు రాజీనామా చేయగా, మూసాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు పనిచేసి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కీలకనేత చున్నూపాషా బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో చున్నూపాషా గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చున్నూపాషా మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఏండ్లతరబడి కష్టపడి పనిచేస్తున్నా గుర్తింపులేదని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన వారికి ఆపదొస్తే ఆదుకునే వారేలేరని వాపోయారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇనిస్తున్నారని.. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కొనియాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. పార్టీలో చేరినవారిలో ఎస్ నర్సింహ, ఎండీ షేర్, ఎండీ అన్నూ, ఎండీ సాజిద్, టీ టింకు, పీ చేతన్, ఎండీ అహ్మద్, ఎండీ ఫరీద్, ఎండీ ఇస్రాజ్ ఉన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జగదీశ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు ఎన్నారైలు కలిసి రావాలి

- సోషల్ మీడియా ద్వారా ప్రజలను చైతన్యం చేయండి
- పదేండ్ల ప్రగతిని కండ్లకు కట్టండి
- బీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రవాస భారతీయులందరూ కలిసి రావాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌తో కలిసి నడిచిన ఎన్నారైలు ఈ కీలక సమయంలో మరింత చురుగ్గా పనిచేయాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న ఎన్నారై శాఖల ప్రతినిధులతో శనివారం కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధన తర్వాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వం తెలంగాణకు అవసరముందనే విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. గొప్ప చదువులు చదివి విదేశాల్లో స్థిరపడిన ప్రవాసులంటే గ్రామాల్లో చాలా గౌరవభావం ఉందని, వారు చెబితే ఓటర్లు వింటారని పేర్కొన్నారు. రానున్న 30 రోజులు ఎంతో కీలకమని తెలిపారు. దారితప్పి ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మళ్లీ 50 ఏండ్లు వెనక్కి పోతుందని హెచ్చరించారు. గతంలో తెలంగాణ అనుభవించిన కష్టాలను, ప్రస్తుతం సాధించిన అభివృద్ధిని వివరిస్తూ వీడియోలు, పోస్టులను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ ప్రజలను చైతన్యం చేయాలని మంత్రి కేటీఆర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పాల్గొన్నారు.

తుంగతుర్తికి కాళేశ్వర జలహారతి

- బంగారు తునకగా మారిన తుంగతుర్తి నియోజకవర్గం
- తొమ్మిదేండ్లలో రూ.5802.67 కోట్ల నిధులతో అభివృద్ధి
- వెనుకబడిన ప్రాంతంలో 'యువ కిశోరం'తో వెలుగులు

> ఒకవైపు కరువు విలయతాండవం.. మరో వైపు రాజకీయ కక్షలు, రక్తపాతం.. గొడవలు, కేసులు.. ఇవే నాడు తుంగతుర్తి నియోజకవర్గంలో బ్రేకింగ్ న్యూస్‌లు. పాలకులకు పట్టింపు లేకుండె.. ప్రజలంటే లెక్కలేకుండె.. కుటుంబాలకు కుటుంబాలు వలసబాట పట్టిన దుస్థితి.. కానీ బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఆ నియోజకవర్గం సస్యశ్యామలమై, పాడిపంటలతో విలసిల్లుతున్నది. రూ.5802.67 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆ ప్రాంత ముఖచిత్రమే మారిపోయింది. పంటలే పండని దారుణ పరిస్థితుల నుంచి పండిన పంటలకు వందల గోదాములను నిర్మించుకొనేంత అభివృద్ధి సాధించింది. స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్ ప్రత్యేక శ్రద్ధతో తుంగతుర్తి బంగారు తునకగా మారింది.

తుంగతుర్తి నియోజకవర్గంలో పారుతున్న కాళేశ్వరం జలాలు

సూర్యాపేట, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల తరబడి కరువు కాటకాలతో అల్లాడిన ప్రాంతం.. నేడు పచ్చని పైర్లతో సస్యశ్యామలంగా మారింది. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి తొలి ఫలితం తుంగతుర్తికే దక్కింది. ఎమ్మెల్యే గాదరి కిశోర్ తొమ్మిదేండ్లలో ఘర్షణలకు తావు ఇవ్వలేదు. అభివృద్ధి పనులకుతోడు కాళేశ్వర జలాల రాకతో చేతినిండా పనులతో ప్రజలు బిజీ అయ్యారు. ఐదేండ్లలో రైతులు పండించిన ధాన్యం విలువే సుమారు రూ.5,863 కోట్లు. నియోజకవర్గంలో 1,41,265 ఎకరాల సాగు భూమి ఉన్నది. 2014కు ముందు నుంచి 2017 యాసంగి వరకు నియోజకవర్గంలో 17,620 ఎకరాల్లో వరి సాగు కాగా.. నేడు 1,12,210 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. కాళేశ్వరం జలాలకుతోడు మిషన్ కాకతీయతో చెరువులు పటిష్ఠమయ్యాయి. రూ.59.01 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, రూ.12 కోట్లతో శ్రీరాంసాగర్ కాల్వల ఆధునీకరణ, రూ.4 కోట్లతో తూముల నిర్మాణం, రూ.65 లక్షలతో కాల్వల్లో కంపచెట్ల తొలగింపుతో నేడు 1,12,210 ఎకరాల్లో వరి పంట పండుతున్నది. మిగిలిన భూముల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి.

రూ.12 కోట్లతో గోదాముల నిర్మాణం

రూ.19.40 కోట్లతో 385 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారు. రూ.7.50 కోట్లతో శాలిగౌరారం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టారు. రూ.4.80 కోట్లతో మోత్కూరు మినీ ట్యాంక్ బండ్, రూ.18 కోట్లతో గురజాల మానాయికుంట బ్రిడ్జి, రూ.3 కోట్లతో అంబేద్కర్ భవనాలు, రూ.27.25 కోట్లతో వంతెనలు, రూ.3 కోట్లతో తిరుమలగిరిలో పాలిటెక్నికల్ కళాశాల భవనం, రూ.2 కోట్లతో ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం నిర్మించారు. తిరుమలగిరి, మోత్కూరు మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.30 కోట్లు కేటాయించారు. రూ.1.55 కోట్లతో అర్వపల్లిలో వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు, రూ.5.50 కోట్లతో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు నిర్మించారు. తుంగతుర్తిలో వంద పడకల దవాఖాన అందుబాటులోకి వచ్చింది. నియోజకవర్గంలోని చారిత్రక ఆలయాలను సైతం అభివృద్ధి పరిచారు. రూ.200 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా దాదాపు అన్ని గ్రామాలకు కృష్ణా జలాలు అందించి ప్రజల దాహార్తి తీర్చారు. వరి ధాన్యం అమాంతం పెరుగడంతో రూ.12 కోట్లతో గోదాములు నిర్మించారు. తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, అడ్డగూడూరు, మోత్కూర్ మండలాల్లో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉన్నాయి. తిరుమలగిరి మండలంలో 2,223 మందిని దళిత బంధుకు ఎంపిక చేశారు. రెండో విడతలో మరో 1,100 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. 2014కు ముందు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రూ.25 వేల నుంచి లక్ష కూడా పలుకని ఎకరం భూమి.. నేడు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతున్నది.

తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించిన తర్వాత శోభాయమానంగా యాదగిరిగుట్ట ఆలయం

నాడు కరువు ఛాయలు.. నేడు ధాన్యపు రాశులు

- 'ఆలేరు'లో సాగుకు జీవం పోసిన గోదావరి జలాలు
- రూ.5,000 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు
- ఇల వైకుంఠపురంగా యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కృషితో ప్రగతి పరుగులు

> నాడు ఆలేరు నియోజకవర్గం కరువుతో అల్లాడింది. వరుస కరువులతో రైతాంగం వలసబాట పట్టింది. నేడు స్వరాష్ట్రంలో ఆలేరు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తున్నది. ఇల వైకుంఠపురంగా యాదాద్రి ఆలయం పునర్నిర్మితమైంది. కాళేశ్వరం జలాలతో బీడు భూముల్లో సిరులు పండుతున్నాయి. ధాన్యపు రాశులు రైతుల ముఖాల్లో వెలుగులు తెచ్చాయి. రూ.5,000 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారాయి. కాళేశ్వరం జలాలతో భూములు సస్యశ్యామలం అయ్యాయి. 2020లోనే బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాలకు కాళేశ్వరం జలాలు అందాయి. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా యాదగిరిగుట్ట నర్సన్న పాదాలను నీళ్లు ముద్దాడాయి. అంతకంటే ముందే దేవాదుల ఎత్తిపోతలో భాగంగా నిర్మించిన నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి గోదావరి జలాలు అందాయి. మూడు మండలాల్లో ఆరు వేల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చాయి. రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయి. సాగుతోపాటు దిగుబడులు పెరిగాయి. వలసలు వెళ్లిన వారంతా తిరిగి సొంతూర్లకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సొంత నిధులతో బునాదిగాని కాలువ పనులు చేయిస్తున్నారు. అతి త్వరలోనే ఈ కాల్వ ద్వారా ఇతర మండలాలకు కాళేశ్వరం జలాలు అందనున్నాయి. నియోజకవర్గంలోని బుక్లేరు, చొల్లేరు, బిక్కేరువాగులతోపాటు ఆలేరు పెద్ద వాగు, పెద్ద కందుకూరు వాగుపై 23 చెక్ డ్యామ్‌లు నిర్మించారు. ఇటీవల మరో 11 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మిషన్ కాకతీయ కింద 579 చెరువులు, కుంటల ఆధునికీకరణకు రూ.112 కోట్లను ఖర్చు చేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగుజలాలు అందుతున్నాయి. 277 ట్యాంక్‌లకు అదనంగా 216 ట్యాంకులు నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1280 కోట్లతో యాదగిరిగుట్టను పునర్నిర్మించింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పాదాల చెంత మెడికల్ కాలేజీ నిర్మాణం కానున్నది. ఆలేరులోని డయాలసిస్ సెంటర్ రోగులకు వరంగా మారింది.

అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి

తొమ్మిదేండ్లలో నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయి. మూడు గురుకులాలు ఏర్పాటయ్యాయి. 98,519 మంది రైతులకు రైతుబంధు, 1020 రైతు కుటుంబాలకు రైతు బీమా అందింది. రూ.300 కోట్లతో కొత్త రోడ్లు నిర్మించారు. 15 వేల మంది ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి ఆర్థికసాయం అందింది. జిల్లాలోని తుర్కపల్లిలో మరో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో పరిశ్రమలు పెద్దఎత్తున తరలిరానున్నాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్నారు. దళితబంధును పైలట్ ప్రాజెక్టుగా అమలుచేశారు. గ్రామంలోని 75 మందికి దళిత బంధు వర్తింపజేశారు. 75 మందికి ఇండ్లు కట్టించే ప్రక్రియ కొనసాగుతున్నది.

కోదాడకు కొత్త శోభ

- రూ.2,450 కోట్ల నిధులతో అభివృద్ధి
- కృష్ణా, కాళేశ్వర జలాలతో సాగుజోరు

> స్వరాష్ట్రంలో కోదాడ కొత్త శోభ సంతరించుకున్నది. నియోజకవర్గం అంతటా కృష్ణా, కాళేశ్వరం జలాలు రావడంతో సాగు పండుగైంది. రూ.2,450 కోట్ల నిధులు వెచ్చించడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి కండ్లముందు కనిపిస్తున్నది.

కోదాడ మండల పరిధిలోని బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన వైకుంఠధామం

సూర్యాపేట, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి పాలనలో అభివృద్ధికి నోచుకోని ఏపీ సరిహద్దు నియోజకవర్గం కోదాడ.. స్వరాష్ట్రంలో ప్రగతిలో పరుగులు తీస్తున్నది. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టిస్తున్నారు. రూ.2,450 కోట్లకుపైనే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేశారు. రూ.200 కోట్లతో ఆర్‌అండ్‌బీ గ్రామీణ రోడ్లను నిర్మించారు. రూ.31 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను బాగు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.60.79 కోట్లు అందాయి. మిషన్ భగీరథ కింద 118 గ్రామాలకు రూ.493 కోట్లతో ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తున్నారు. కోదాడ ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు పె